చెరువు గండిని పూడ్చరూ..

- తొమ్మిది నెలలుగా పూడ్చివేతకు నోచుకోని అంబారిపేట పెద్దచెరువు గండి
- గత సంవత్సరం సెప్టెంబర్‌లో తెగిన కట్ట
- వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆందోళన చెందుతున్న రైతులు


గండి నుంచి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

శాలిగౌరారం: నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది శాలిగౌరారం మండలంలోని అంబారిపేట పెద్దచెరువుకు పడిన గండి పరిస్థితి. ప్రభుత్వం సాగునీటి వనరుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం రైతులను ఇబ్బందులు గురిచేస్తోంది.

2024 సెప్టెంబర్ 2న చెరువుకట్టకు గండి

శాలిగౌరారం మండలంలో 2024 ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ 3 వరకు తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు పలు చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోశాయి. వరదనీటి ప్రవాహం అధికం కావడంతో అంబారిపేట గ్రామ పెద్దచెరువు అలుగు వద్ద చెరువు కట్టకు సెప్టెంబర్ 2న గండి పడింది. దీంతో వరద నీరు పంటపొలాల మీదుగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగి ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజుల అనంతరం చెరువు గండిని నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. చెరువు కట్టకు పడిన గండిని పూడ్చి చెరువు నీటివృథాను అరికట్టి పంట పొలాలు దెబ్బతినకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కానీ నేటికీ అధికారులు హామీని అమలు చేయలేదు.

తొమ్మిది నెలలు గడిచినా...

అంబారిపేట పెద్దచెరువుకు గండి పడి తొమ్మిది నెలలు కావొస్తోంది. కానీ నేటికీ గండిని పూడ్చలేదు. చెరువు కట్టకు అలుగు వద్ద పడిన గండి వల్ల చెరువులోని నీరు మొత్తం ఖాళీ కావడంతో గడిచిన యాసంగిలో ఆయకట్టు భూములు బీళ్లుగా ఉన్నాయి. చెరువు కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు పూర్తిస్థాయిలో నిండితే వానాకాలం 150 ఎకరాలకు, యాసంగి 100 ఎకరాలకు సాగునీరు అందుతుంది. చెరువులో నీటి నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావులు, బోర్ల ద్వారా మరో 150 ఎకరాలు వరిపంట సాగవుతుంది. కానీ గత సంవత్సరం చెరువుకట్టకు పడిన గండివల్ల వానాకాలం పంటలకు సరిపడా నీరందక పంటలు దెబ్బతినడంతో పాటూ యాసంగి పంటను రైతులు పూర్తిగా కోల్పోయారు. చెరువుకు పడిన గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టి ఆయకట్టుకు సాగునీరందేలా చూడాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అంబారిపేట పెద్దచెరువుకు గత సంవత్సరం పడిన గండి విషయాన్ని సంబంధిత అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లాం. అయినా నేటికీ గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టలేదు. తొమ్మిది నెలలుగా ఇదే పరిస్థితి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చెరువు గండిని పూడ్చే ఏర్పాట్లు చేయాలి.

–లింగాల శేఖర్, రైతు, అంబారిపేట

యాసంగి పంటను కోల్పోయాం



గత సంవత్సరం సెప్టెంబర్‌లో అంబారిపేట పెద్దచెరువుకు పడిన గండి వల్ల చెరువులోని నీరు మొత్తం బయటకు వెళ్లిపోయింది. దీంతో గడిచిన యాసంగి పంటను పూర్తిగా కోల్పోయాం. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమయ్యింది. చెరువు గండిని పూడ్చకపోతే ఈ సంవత్సరం రెండు పంటలను కోల్పోవాల్సిందే.

–నారగోని వీరయ్య, రైతు, అంబారిపేట

ప్రతిపాదనలు పంపాం



అంబారిపేట పెద్దచెరువుకు గత సంవత్సరం పడిన గండిని పూడ్చి అలుగు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు కూడా వచ్చాయి. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే గండి పూడ్చివేత పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేస్తాం.

–సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ, తిరుమలగిరి డివిజన్

యోగా మాసోత్సవాల్లో పాలుపంచుకోవాలి


చిట్యాల : పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల : ప్రతి ఒక్కరూ యోగా మాసోత్సవాల్లో పాలుపంచుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు పిలుపునిచ్చారు అంతర్జాతీయ యోగా మాసోత్సవాల ప్రచార పోస్టర్‌ను చిట్యాలలో బుధవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఆయుష్ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తయ్యబా కౌసర్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఈసం వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ నర్సింహ్మారావు, పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, యోగా ఇన్‌స్ట్రక్టర్ కె.భజరంగ్ ప్రసాద్, వైష్ణవి, ఆశా వర్కర్‌లు జయమ్మ, సైదమ్మ, శైలజ, గీతా, రజిత, కవిత పాల్గొన్నారు.


కట్టంగూర్ : యోగా పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ సిబ్బంది

కట్టంగూర్ : యోగా దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని అయిటిపాముల ఆయుష్ డిస్పెన్సరీ వైద్యాధికారి ఊర్మిళ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ అనే నినాదంతో 11వ ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27నుంచి జూన్ 21వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఉమారాణి, సైదులు, యోగా ఇన్‌స్పెక్టర్ శరత్, నిర్మల, ఆశావర్కర్లు ఉన్నారు.

యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి


సమీక్షలో పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్

నకిరేకల్ : మండలం, మున్సిపాలిటీలో రాజీవ్ యువ వికాసం కింద లబ్ధిదారుల ఎంపిక జాబితా రూపొందించి కలెక్టర్‌కు పంపామని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంకర్స్, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నకిరేకల్ మండల, మున్సిపాలిటీలో మొత్తం 1520మంది రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వీరి మొత్తం జాబితాను పరిశీలిన చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద 655మందికి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. లబ్ధిదారులకు తుది జాబితా ఎంపిక విషయంలో బ్యాంకర్లు సిబిల్ స్కోర్ ఆధారంగా ప్రకటిస్తారన్నారు. ఈ సమావేశలలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల స్థాయి అధికారులు, ఆయా బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలి


శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి

నకిరేకల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తేవాలని జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి సూచించారు. నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ, స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే మాస్టర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంతలి సోములుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ నగేష్, జనరల్ సెక్రటరీ నాగార్జున, కోచ్‌లు ఆర్.విజయ్‌కుమార్, అంజి, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసన సభలో బిల్లు పెట్టి ఆమోదించిన జీఓ జారీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణలు అన్నారు. బుధవారం నల్లగొండలోని యాదవ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆ బిల్లుకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి జీఓ జారీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే బీసీల ఆధ్వర్యంలో పోరాటం చేసి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జేర్రిపోతుల రమేశ్‌గౌడ్, షర్పు యాదగిరి, వల్ల కీర్తి శ్రీనివాస్, మల్లెబోయిన సతీష్ యాదవ్, సుంకరబోయిన శివ యాదవ్, అల్లి చంద్రయ్య, ఆడం తిరుపతి గౌడ్, కొవ్వూరి హరిబాబు, గంజి మల్లేశం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌గా మార్చాలి

చిట్యాల : వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవ్వగా పలువురు వినతి పత్రాలను అందజేశారు. నార్కట్‌పల్లి మండలంలోని సబ్ వ్యవసాయ మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీగా కేటాయించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంత్రిని కోరారు. చిట్యాల మండలంలోని ఎనిమిది గ్రామాలు చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్నాయని వాటిని చిట్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలోనికి మార్చాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. చిట్యాల పట్టణంలో జాతీయ రోడ్డుపై నిర్మిస్తున్న మట్టికట్ట కిందుగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మూడు చోట్ల అండర్ పాసింగ్‌లు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు వినతి పత్రం అందజేశారు.

ఆత్మరక్షణకు తైక్వాండో

చండూరు : ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ కోడి శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 25న నల్లగొండలో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలైన గాంధీజీ పాఠశాల విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు. టి.వేదాన్షి ఒకటో తరగతి, కె.రిత్విక్ ఏడో తరగతి, ఎం మధు ఎనిమిదో తరగతి విద్యార్థులు బంగారు పతకాలు, ఎం ఉదిత్ వెండి పతకాన్ని సాధించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకన్న, ట్రైనర్ రమేష్, వెంకటేశ్వర్లు, యాదయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బట్లకాల్వ రోడ్డుకు మోక్షం


బట్లకాల్వలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

మునుగోడు : ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మునుగోడు పట్టణంలోని బట్లకాల్వ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగింది. మునుగోడు నుంచి దుబ్బకాల్వ మీదుగా కొరటికల్ గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి 2018లో ప్రధాన మంత్రి సడక్ యోజన నిధుల నుంచి 6.3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంతో పాటు కల్వర్టుల నిర్మాణానికి రూ. 3.12 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు ప్రారంభించారు. ఇంతలోనే మునుగోడు పట్టణంలోని బట్లకాల్వ రోడ్డు తనకు పట్టా ఉందని ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించగా అధికారులు ఆ పనులు పూర్తిగా నిలిపివేశారు. దానికి తోడు ప్రధాన మంత్రి సడక్ యోజనలో మంజూరైన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేశారు. ఈ విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆ రోడ్డుకు అవసరమైన నిధులు సీఆర్ఆర్ (గ్రామీణ రోడ్ల నిర్మాణానికి) నిధుల నుంచి 300 మీటర్ల సీసీతో పాటు కొరటికల్ గ్రామ సమీపంలో మిగిలిన 800 మీటర్లకు అవసరమైన రూ. 80లక్షల నిధులు వారం రోజుల క్రితం మంజూరుచేయించాడు. అంతేగాకుండా ఆ పనులు వేగవంతంగా చేట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. కొరటికల్ గ్రామ సమీపంలోని బీటీ రోడ్డు పూర్తిచేశారు. బట్లకాల్వలో సీసీ రోడ్డు వేసేందుకు ముందుగా రోడ్డు ఎత్తు పెంచుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి


కేతేపల్లి : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణకుగాను, కూలీల డిమాండ్ల సాధనకుగాను ఈ నెల 30న నిర్వహించనున్న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, మండల అధ్యక్షుడు కల్లూరు కుమారస్వామి, లక్ష్మీనారాయణ, పరమేష్, రాములు, నర్సింహాచారి, రాములు, మల్లయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి : ఉపాధిహామీ చట్ట రక్షణ, కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఈ నెల 30న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చినవెంకులు పిలుపునిచ్చారు. బుధవారం కేతేపల్లిలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్థుమారయ్య, నాయకులు మండల వెంకన్న, ఆదిమళ్ల నాగయ్య, వంగూరి వెంకన్న, తూముల డానియల్, బొప్పని ప్రవర్ధన్, జయమ్మ పాల్గొన్నారు.

పంట మార్పిడితో భూసారం పెరుగుతుంది

మునుగోడు : రైతులు ప్రతి ఏటా ఒకే పంట సాగు చేయకుండా పంటలు మార్పిడిచేస్తే ఆ భూమిలో భూసారం పెరుగుతుందని ఏఈఓ నర్సింహ సూచించారు. మండలంలోని కల్వలపల్లి గ్రామ రైతులకు బుధవారం పంటమార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం సూచనల ప్రకారం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అధికారుల సూచన మేరకు ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలో కుండపోత వర్షం

శాలిగౌరారం: మండలంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో ప్రారంభమైన కుండపోత వర్షం నాలుగు గంటలపాటూ ఏకధాటిగా కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుండపోత వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి 10 గంటల వరకు మండలం అంధకారంలోనే ఉంది. మంగళవారం రాత్రి 105 మిల్లీమీటర్లు(10.5 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైనట్లు మండల ప్రణాళిక మరియు గణాంకశాఖ అధికారి రామదాసు బుధవారం తెలిపారు.

మంద కృష్ణకు పద్మశ్రీ.. మాదిగలకు దక్కిన గౌరవం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు

నల్లగొండ టౌన్ : ఢిల్లీలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ పద్మశ్రీ పురస్కారం అందుకోవడం మాదిగ జాతికి దక్కిన గౌరవమని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ అన్నారు. నల్లగొండలో బుధవారం అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశ్రీ అవార్డుతో ఈ నెల 31న వరంగల్ జిల్లా కేంద్రానికి తిరిగి వస్తున్న మందకృష్ణకు స్వాగతం పలకడానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్‌కు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లపాక వెంకన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లంకపల్లి నగేష్, మాదిగ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సుదర్శన్, గట్టు మలయ్య, ప్రసాద్, హరి, ఏడుకొండలు, కొత్త వెంకన్న, జలంధర్, వీరబోయిన సైదులు, మాసారం వెంకన్న, తల కొప్పుల రాజు, మల్లపల్లి రాంబాబు, రణవీర్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కనగల్ : మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయం చుట్టూ మామిడి తోరణాలు కట్టి అలంకరణ చేశారు. గ్రామ దిగ్బంధన కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్సవ విగ్రహాల ఊరేగింపును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గౌడ కులస్తులు మాలలు ధరించారు.

ఆరుగురు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మునుగోడు: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి బదిలీ చేశారు. ఇటీవల మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విధుల పట్ల అలసత్వం వహించిన కార్యదర్శులను గుర్తించి బదిలీ చేయాలని, అంకితభావంతో పనిచేసే సిబ్బందిని మాత్రమే నియోజకవర్గంలో ఉంచాలని సూచించారు. స్పందించిన అధికారులు మొదటి దఫాగా మునుగోడు మండలంలో పనిచేస్తున్న కార్యదర్శుల్లో నలుగురితోపాటు గతంలో డిప్యూటేషన్‌పై మునుగోడుకు బదిలీపై వచ్చిన మరో ఇద్దరు కార్యదర్శులను బదిలీ చేశారు. బదిలీ అయినవారిలో చీకటిమామిడి కార్యదర్శి ఎస్.రవీందర్‌రెడ్డి, గూడపూర్ కార్యదర్శి సంగీత, కల్వలపల్లి కార్యదర్శి తిరుమలేష్, కచలాపురం కార్యదర్శి బి.సైదులు ఉన్నారు. వీరందరినీ దేవరకొండ డివిజన్‌లోని నేరేడుగొమ్ము మండలానికి బదిలీ చేశారు. వీరితోపాటు చింతపల్లి మండలం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన చల్మెడ కార్యదర్శి కె.నాగసుధ, తిరుమలగిరి సాగర్ నుంచి వచ్చిన ఊకొండి కార్యదర్శి షేక్ అసీస్ అలీలను అదే మండలాలకు బదిలీ చేశారు. ఆరుగురు కార్యదర్శులు బదిలీ కావడంతో ఆ గ్రామాలకు ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న కార్యదర్శుల్లో కొందరికి రెండు గ్రామాల చొప్పున కేటాయించారు.

బి వెల్లెంల ప్రాజెక్టు నుంచి నీటిని అందించాలని వినతి

రామగిరి(నల్లగొండ): బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీటిని అందించాలని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ అశోక్‌రెడ్డిని కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ మండలంలోని అన్నెపర్తి, బుద్ధారం, దోమలపల్లి నర్సింగ్‌బట్ల, కంచనపల్లి, దోనకల్, గుండ్లపల్లి, కాకుల కొండారం గ్రామాల్లోని చెరువులు నింపి ఆయా గ్రామాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ నారబోయిన బిక్షం, మాజీ జెడ్పీటీసీ తుమ్మల రాధ లింగస్వామి, మండల ప్రధాన కార్యదర్శి బడుపుల శంకర్, బీఆర్ఎస్ నాయకులు భీమనపల్లి నగేష్, తోకల సైదులు, పుట్ట సుభాష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని..

చిట్యాల : పట్టణంలో అరవై ఐదో నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మూడు చోట్లు అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ పీడీ నాగేశ్వరరావుకు చిట్యాల పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బస్‌స్టేషన్ ఎదురుగా, వనిపాకల రోడ్డు ఎదురుగా అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రుద్రవరం లింగస్వామి పాల్గొన్నారు.

డీఐఈఓకు..

నల్లగొండ టూటౌన్ : అనుమతి లేని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డీఐఈఓ దస్రూనాయక్‌కు బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో దుబ్బాక రామకృష్ణ యాదవ్, కొల్లరి నగేష్, లింగయ్య, కుమార్, శివశంకర్, అంజి, వెంకన్నలు ఉన్నారు.

క్లుప్తంగా

హెల్త్‌కార్డుల రిజిస్ట్రేషన్‌కు అవకాశం

రామగిరి(నల్లగొండ) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు నల్లగొండ డిస్పెన్సరీలో హెల్త్ కార్డుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల నల్లగొండ రీజియన్ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, సెక్రటరీ పల్‌రెడ్డి యాదగిరిరెడ్డి, భోనగిరి శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రిటైర్డ్ ఉద్యోగులు హెల్త్‌కార్డులు పొందాలంటే తార్నాక ఆర్టీసీ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉండేదన్నారు. కాని ఇప్పుడు నల్లగొండలోని డిస్పెన్సరీలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగి హెల్త్‌కార్డు పొందవచ్చని తెలిపారు. ఉమ్మడి రీజియన్‌లోని రిటైర్డ్ ఉద్యోగులు ఆధార్‌కార్డు, బస్‌పాస్, ఐడీ కార్డుతో నల్లగొండ డిస్పెన్సరీని సంప్రదించాలన్నారు. ఉద్యోగుల అభ్యర్థన మేరకు నల్లగొండ డిస్పెన్సరీలో హెల్త్‌కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిన ఆర్టీసీ యాజమాన్యానికి రిటైర్డ్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

బెడ్ షీట్ల పంపిణీ


బెడ్ షీట్లతో ఐఎంఏ సభ్యులు

నల్లగొండ టౌన్ : పానగల్ చారుమతి చైల్డు కేర్ ఆశ్రమంలో బుధవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నీలగిరి ఆధ్వర్యంలో 15బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగసేన రెడ్డి, డాక్టర్లు పుల్లారావు, శ్రీనివాసరావు, యాదయ్య, నరేష్, శ్రీలత పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్యశాలను జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ రమేష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, పశువులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.సురేందర్, సిబ్బంది ఎల్లేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మర్రిగూడ : మండల కేంద్రంలో 11కేవీ లూస్ విద్యుత్‌లైన్‌కు మెయింటనెన్స్ వర్క్ జరుగుతున్నందున గురువారం మండల కేంద్రంలో ఉదయం 6.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మర్రిగూడ విద్యుత్ ఏఈ వంశీకృష్ణ బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

31న ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్: నల్లగొండలో ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి, ఇంటాస్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హేమిఫిలియా వ్యాధిగ్రస్తులకు ఈనెల 31న ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడ్మిషన్ల కోసం టీచర్స్‌పై ఒత్తిడి తేవొద్దు

నకిరేకల్ : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం టీచర్లపై ఒత్తిడి తేవొద్దని తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్(టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విజయ్‌కుమార్ కోరారు. నకిరేకల్‌లో బుధవారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ టీచర్స్‌ను వేసవిలో సెలవులు తీసుకోకుడా యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆదివారం కూడా క్యాంపెయిన్ చేయాలని కోరడం తగదన్నారు. ఈ సమావేశంలో ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రబాద్, టీచర్లు కాశయ్య, నాగేందర్, ఉపేందర్, నర్సింహరావు, రోజా పాల్గొన్నారు.

హమాలీ కుటుంబానికి ఆర్థికసాయం

శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం రాత్రి లారీ కిందపడి మృతిచెందిన బిహార్ రాష్ట్రానికి చెందిన సూరజ్‌కుమార్(20) కుటుంబీకులకు బుధవారం లారీ అసోసియేషన్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ కిరాయి, దహనసంస్కారాల నిర్వహణ కోసం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవతో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డితోపాటూ పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా పాటుపడ్డారు. లారీ అసోసియేషన్ రూ.90 వేలు, ప్రమాదానికి కారణమైన లారీ యజమాని రూ.40 వేలు, చిత్తలూరు, తుడిమిడి ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రూ.20 వేలు అందించారు.

స్నేహితుడి కుటుంబానికి..

శాలిగౌరారం మండలంలోని మనిమద్దె గ్రామానికి చెందిన కొండ్రాసి పున్నమయ్య(35) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పున్నమయ్య కుటుంబానికి అతడితోపాటు 2004 లో ఎస్సెస్సీ చదివిన స్నేహితులు బుధవారం రూ.10 వేలు నగదుతోపాటూ 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కోటగిరి రమేష్, దాసరి సత్యనారాయణ, వేముల రమేష్, రాచకొండ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.